# నీ ప్రాణానికి నా ప్రాణం



**కొందరిని గత జీవితం అంత తేలికగా వదలిపెట్టదు. నీడలా వెంటబడుతూనే ఉంటుంది. చివరికి ఏదో ఒక రోజున అది వారిని దొరకపుచ్చుకోకా తప్పదు, వారు తగిన విధంగా మూల్యం చెల్లించుకోకా తప్పదు**

ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో తన మోటారు సైకిల్ మీద హైదరాబాద్ వైపు వేగంగా వెళ్తున్న శ్రీధర్‌కు బాగా ఆకలేస్తున్నట్లనిపించింది. హోటల్‌కు వెళ్ళి టిఫిన్ చెయ్యాలి. ఇంకో అయిదారు కిలోమీటర్లు వెళ్తేగాని హోటల్ రాదు. ఈ రోజు తెల్లారక ముందే, నాల్గున్నరకే లేచి తన హీరో హోండాని బయటకు తీసి సిటీకి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న తన మిత్రుడు సోమేశ్వర్ నడుపుతున్న పౌల్ట్రీ ఫామ్‌కు వెళ్ళాడు.

కాలేజీలోంచి డిగ్రీ తీసుకొని బయటకొచ్చాక కొంతకాలం వరకు తనకేం చెయ్యాలో తోచలేదు. ఉద్యోగం దొరికే అవకాశాలు అస్సలు లేవని తెలిసిపోయింది. అప్పటికే తన పెళ్ళయిపోయింది. తల్లితండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా తనతో పాటు కాలేజీలో చదువుతున్న ఉమను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఉమ ఆ రోజుల్లో తన అభిమాన కవి క్రాంతికుమార్ కూతురు. ఆ రోజుల్లో తనకు విప్లవ కవిత్వమంటే, అందులో క్రాంతికుమార్ రాస్తున్న విప్లవ కవిత్వమంటే పిచ్చి అభిమానం. ఉమ క్రాంతికుమార్ కూతురని తెలియగానే ఆమెతో స్నేహం చెయ్యడం మొదలుపెట్టాడు. త్వరలోనే ఆ స్నేహం ప్రేమగా మారింది. మిత్రులంతా కలిసి తమ పెళ్ళి 'చేశారు. తాను, ఉమ విప్లవ విద్యార్థి సంఘాల్లో చాలా చురుకుగా పనిచేస్తుండేవాళ్ళు. ఒకటి రెండు సార్లు విప్లవ విద్యార్థి సంఘాలకు సంబంధించిన పోస్టర్లను గోడల మీద అతికిస్తూ పోలీసులకు దొరికిపోయాడు. ఇంటరాగేషన్‌లో వాళ్ళు తననెన్నో ప్రశ్నలడిగారు. అండర్ గ్రౌండ్‌లో ఉన్న కొందరు లీడర్లను గురించి చెప్పమన్నారు. వాళ్ళను గురించి తనకేమీ తెలియదన్నాడు.

తన మీద థర్డ్ డిగ్రీ మెథడ్స్ ప్రయోగించబోతుండగా తనను పోలీసులు అరెస్టు చేశారని తెలుసుకున్న నాన్న పోలీస్ స్టేషన్‌కొచ్చి ఎస్.ఐని కలిశాడు. తనకు చెప్పకుండానే ఉమను పెళ్ళి చేసుకున్నానని నాన్నకు నా మీద ఎంత కోపంగా ఉన్నా, తనను పోలీసుల బారి నుంచి విడిపించకుండా ఉండలేకపోయాడు. తర్వాత తెలిసింది ఆ ఎస్.ఐ మాకు చాలా దగ్గర బంధువని.

కాలేజీ నుంచి డిగ్రీ తీసుకొని బయటకొచ్చాక తనకు విప్లవ కవిత్వం మీదున్న మోజు తగ్గిపోయింది.

కవిత్వం అన్నం పెట్టదని కూడా తెలిసిపోయింది. బతుకుతెరువు కోసం ఏదన్నా చెయ్యాలి.

వాళ్ళకిష్టం లేని ఓ దళిత కులానికి చెందిన అమ్మాయిని పెళ్ళి చేసుకోవడం వల్ల అమ్మానాన్నల దగ్గరకెళ్ళి వాళ్ళ మీద ఆధారపడి బతకడం ఇష్టం లేదు. నాన్న ఆర్థికంగా ఉన్నవాడే. ఆ ప్రాంతంలో కాస్త పేరున్న రాజకీయ నాయకుడు కూడా.

ఏం చేద్దామా అని ఆలోచిస్తుండగా తన ఒకప్పటి మిత్రుడు సోమేశ్వర్ కలిశాడు. సోమేశ్వర్ తనకు ఇంటర్మీడియట్‌లో క్లాస్‌మేట్. తాను చదువులో చాలా తెలివైనవాణ్ణని తనంటే సోమేశ్వర్ చాలా ఇష్టపడేవాడు. ఇంటర్మీడియట్ పూర్తిచెయ్యకుండానే సోమేశ్వర్ చదువు మానేసి ఏదన్నా బిజినెస్ చేసుకుంటానని కాలేజీలోంచి వెళ్ళిపోయాడు. నాలుగేళ్ళ తర్వాత మళ్ళీ కలిశాడు. తానో పెద్ద పౌల్ట్రీ ఫామ్ పెట్టానని, చాలా సక్సెస్‌ఫుల్‌గా నడుస్తోందని చెప్పాడు. 'నువ్వేం చేస్తున్నా'వని అడిగితే బి.ఏ పూర్తిచేశానని, తర్వాతేం చెయ్యాలో తోచడం లేదని చెప్పాడు శ్రీధర్.

"బి.ఏ చేసినా దండగే. ఎం.ఏ చేసినా దండగే. ఈ చదువులు మనకు అన్నం పెట్టవు. నేనో పని చూపిస్తాను. చేస్తావా" అన్నాడు.

"పని కోసమే చూస్తున్నాను. తప్పకుండా చేస్తాను. పనేమిటో చెప్పు" అన్నాడు తాను.


"నా పౌల్ట్రీ నుంచి నేను ఎగ్స్ సప్లయ్ చేస్తాను. వాటిని నువ్వు రిటైల్ షాప్స్‌కు సప్లయ్ చెయ్యి. నేను నీకు హోల్‌సేల్ రేటు కంటే కూడా కొంచెం తక్కువకే ఇస్తాను. నీకు రిటైలు రేటొస్తుంది. కొంచెం కష్టపడ్డావంటే నీకు మంచి గిట్టుబాటుంటుంది. పౌల్ట్రీ నుంచి ఎగ్స్ తీసుకెళ్ళి రిటైల్ షాప్స్‌కు డిస్ట్రిబ్యూట్ చెయ్యడమే నీ పని. తర్వాతెళ్ళి అమ్మకాల్ని బట్టి రిటైలర్స్ నుంచి డబ్బు కలెక్ట్ చేసుకోవడం. మాకివ్వాల్సింది మాకిచ్చి, మిగతాది నువ్వు తీసుకోవడం. ఇదీ పని. చేస్తావా" అన్నాడు సోమేశ్వర్.

ఈ పనేదో బాగానే ఉంటుందనిపించింది. ఎక్కువ సేపు ఆలోచించకుండానే 'తప్పకుండా చేస్తా'నని ఒప్పేసుకున్నాడు. ఇంటికొచ్చి ఉమకు ఈ విషయం చెప్పాడు. "బాగానే ఉంటుంది. చేద్దాం" అంది ఉమ. అలా తానీ బిజినెస్‌లోకొచ్చాడు.

సోమేశ్వర్ అన్నమాట నిలుపుకున్నాడు.

తనకు చాలామంది రీటైల్ షాపు ఓనర్స్‌ని పరిచయం చేశాడు. పౌల్ట్రీ నుంచి రోజూ ఎగ్స్ తీసుకురావడానికి తనకో ఆటోను కూడా అద్దెకిప్పించాడు. అయిదారు నెలల్లోనే తనకు మంచి ఫలితాలు కనిపించాయి. ఖర్చులన్నీ పోగా తనకో మూడు నాలుగు వేలు మిగిలాయి. ఆ తర్వాత సోమేశ్వర్ తనకో సెకండ్ హ్యాండ్ మోటారు సైకిల్ కూడా కొనిపెట్టాడు. దానికోసం ప్రతి నెలా వెయ్యి రూపాయల చొప్పున ఇన్‌స్టాల్‌మెంట్స్ కడ్తూ ఇరవై అయిదు నెలల్లో ఆ అప్పు వడ్డీతో సహా పూర్తి చెయ్యాలన్నాడు. తనకీ అరేంజ్‌మెంట్ ఎంతో బావుందనిపించింది. సోమేశ్వర్ తనకు చేసిన ఈ సహాయాన్ని ఎన్నడూ మరచిపోలేననుకున్నాడు.

ఈలోగా ఉమ ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా చేరింది. వాళ్ళు ఆమెకు నెలకు పది హేను వందలిస్తున్నారు. దాంతో తమ జీవితం ఓ దార్లో పడిందనిపించింది. కష్టపడ్డకొద్దీ ఫలితం కనిపించసాగింది. ఇంకా కష్టపడ్తే ఇంకా ఎక్కువ సంపాదించవచ్చుననిపించింది. ఇలా చేతినిండా పనుండడంతో తనకు విప్లవం గురించి ఆలోచించడానికిగానీ, విప్లవ కవిత్వం చదవడానికిగానీ టైమ్ దొరికేది కాదు. ఎంతో విప్లవ కవిత్వం రాసి, ఎందరో యువకులు అండర్‌గ్రౌండ్‌కు వెళ్ళడానికి పరోక్షంగా కారకులైన కొందరు విప్లవ కవులు కూడా తాము చేస్తున్న ఉద్యోగాలకు రాజీనామా చేసి అండర్‌గ్రౌండ్‌కు వెళ్ళలేదు కదా. ఇలా ఆలోచించినప్పుడు శ్రీధర్‌కు తాము ఎంచుకున్న మార్గం



సరియైనదేననిపించింది.


శ్రీధర్ సిటీలో ప్రవేశించాడు. తాను ఎప్పుడూ వెళ్ళే ఓ ఉడుపి హొటల్ ముందు మోటార్ సైకిల్ పార్క్ చేసి లోపలకెళ్ళాడు. వాష్ బేసిన్‌లో చేతులు కడుక్కొని ఓ టేబుల్ ముందున్న కుర్చీలో కూర్చున్నాడు. "హల్లో కామ్రేడ్" అంటూ నల్లటి దుస్తులు వేసుకున్న ఓ వ్యక్తి వచ్చి శ్రీధర్‌కు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. శ్రీధర్ ఆ వ్యక్తికేసి చూసి కొన్ని సెకండ్లలోనే అతడెవరో గుర్తుపట్టి ఆశ్చర్యపడ్డాడు. "సుధాకర్, నువ్వా" అన్నాడు శ్రీధర్.

"నేనే. గుర్తుపడ్తావో, లేదో అనుకున్నాను. గుర్తుపట్టావు. చాలా సంతోషం."

"నిన్ను గుర్తు పట్టకుండా ఎలా ఉంటాను. కొంతకాలం ఒక ప్రాణంగా తిరిగినవాళ్ళం. ఏమిటీ అయ్యప్పస్వామి వేషం? విప్లవానికి గుడ్ బై చెప్పేసి అయ్యప్ప భక్తిలో పడిపోయావా ఏమిటి?"

"నల్లటి దుస్తులు వేసుకున్నంతమాత్రాన అయ్యప్ప భక్తుడినైపోయాననుకోకు. మాకు

> "నేను వెళ్ళవలసింది ఎక్కడికో నీకు చెప్పకూడదు. మనం కలుసుకున్నట్టే ఎవరికీ తెలియకూడదు. అన్నట్టు నా పేరిప్పుడు సుధాకర్ కాదు, వరహాల స్వామి. అర్థమైందను కుంటాను."



చిత్రాలు: నర్సిం

చాలా వేషాలెయ్యాల్సివస్తుంది. విప్లవానికి నీలాంటి వాళ్ళు గుడ్ బై చెబుతారు. మాలాంటివాళ్ళెప్పుడూ ఆ పని చెయ్యరు. విప్లవం అనివార్యం. రోజూ తూర్పున సూర్యుడు ఉదయించడం ఎంత అనివార్యమో విప్లవం జయించడం కూడా అంత అనివార్యం. ప్రపంచంలో ఏ శక్తీ విప్లవాన్ని ఆపలేదు."

"ఈ మాటలు వినీ వినీ చెవులు తూట్లు పడ్డాయి. అది సర్లేగానీ, మొదట ఏం తింటావో చెప్పు."

"ఏదైనా ఫరవాలేదు. నువ్వేది తింటే నేనూ అదే తింటాను."

సర్వర్‌ను పిలిచి "రెండు ప్లేట్లు ఇడ్లీ తీసుకు రమ్మ"ని చెప్పి శ్రీధర్ మరోసారి సుధాకర్‌కేసి చూశాడు.

డిగ్రీ కాలేజీలో చదువుకునే రోజుల్లో సుధాకర్ తనకు అత్యంత ఆత్మీయుడు. సుధాకర్‌లో ప్రతి అణువులో విప్లవ భావాలు తొణికిసలాడేవి. అతను కదిలితే విప్లవం. నడిస్తే విప్లవం. కూర్చుంటే విప్లవం. సుధాకర్‌ను చూస్తే మూర్తీభవించిన విప్లవంలా ఉండేవాడు. అతని చుట్టూ ఎప్పుడూ గుంపులుగుంపులుగా విద్యార్థులు.

ఆనాటి ప్రముఖ విప్లవ కవుల కవితలన్నీ సుధాకర్ మాటల్లో దొర్లిపోతుండేవి.

సుధాకర్‌ది చాలా ఆకర్షణీయమైన రూపం.

ఆరడుగుల ఎత్తు. ఎర్రటి రంగు. విశాలమైన నుదురు. భుజాల దాకా వేలాడే నల్లటి దట్టమైన జుట్టు. ఎదుటివాడి వైపు తీక్షంగా చూసే తళతళ మెరిసే కళ్ళు. ఎప్పుడూ తెల్లటి కాటన్ షర్ట్, పైజామా వేసుకొని కాలేజీలో తన మిత్రులతో తిరిగే సుధాకర్ ఆకర్షణలో పడకుండా ఉండడం ఆ కాలేజీలో చాలామంది విద్యార్థులకు సాధ్యమయ్యేది కాదు.

తాను కూడా చాలా త్వరలోనే సుధాకర్ ఆకర్షణలో పడిపోయాడు. తనకు క్రాంతికుమార్ తెలుసునని, నిన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళి ఆయనను నీకు పరిచయం చేస్తానని సుధాకర్ చెప్పడంతో శ్రీధర్ అతనికి పూర్తిగా వశమైపోయాడు. కేవలం సుధాకర్ ఒక్కడి కారణంగానే ఆ కాలేజీలో విప్లవ విద్యార్థి సంఘం ఒక బలమైన శక్తిగా రూపొందింది.

అలాంటి సుధాకర్ ఇప్పుడిలా నల్లటి దుస్తులతో, మాసిన గడ్డంతో, తైల సంస్కారం లేక వరిగడ్డిలా మారిపోయిన జుట్టుతో, ఎన్నో రోజులుగా నిద్రాహారాలు లేక లోపలకు పీక్కుపోయిన కళ్ళతో చాలా వికృతంగా, దయనీయంగా కనిపించాడు.

"ఇలా అయిపోయావేం సుధాకర్? కొంపదీసి అండర్‌గ్రౌండ్‌లో గానీ పనిచేస్తున్నావా" అన్నాడు శ్రీధర్.

సుధాకర్ నవ్వి, "నా విషయం వదిలెయ్. నువ్వేం చేస్తున్నావో చెప్పు?"

"బతుకుతెరువు కోసం ఏదో ఒకటి చెయ్యాలి కదా. అందరూ నీలాగ విప్లవాన్ని తాగుతూ, విప్లవాన్ని తింటూ బతకలేరు కదా?"

"ఒకప్పుడు నువ్వూ విప్లవాన్ని తాగుతూ, విప్లవాన్ని తింటూ బతికినవాడివేనని మరచిపోకు."

"అదీ ఒకప్పటి మాట. ఒక గొప్ప భ్రమలో బతికినప్పటి మాట."

"అప్పటి రోజులన్నీ భ్రమేనంటావు."

"నిస్సందేహంగా."

"ఐ పిటీ యూ."

"ఐ టూ పిటీ యూ." ఇద్దరూ నవ్వారు.

"పిచ్చివాణ్ణి చూసి మనం జాలిపడ్తే, మనల్ని చూసి పిచ్చివాడు జాలిపడ్తాడట. అలా ఉంది మనిద్దరి వ్యవహారం" అన్నాడు శ్రీధర్.

సర్వర్ రెండు ప్లేట్లు ఇడ్లీలు తెచ్చి వాళ్ళ ముందు పెట్టాడు. ఇద్దరూ తినడం మొదలు పెట్టారు.

"ఉమ ఎలా ఉంది?"

"బాగానే ఉంది."

"ఆమె కూడా నీలాగే విప్లవాన్ని వదిలేసిందా?"

"తప్పలేదు."

"తండ్రివయ్యావా?"

"అవబోతున్నాను. ఇంకో నాలుగు నెలల్లో."

"ఉమకు నా లాల్ సలామ్ చెప్పు."

"అలాగే. అప్పటి మన రాడికల్ ఫ్రెండ్స్ ఉపేందర్ రావు, యాదగిరి, సారయ్య, సంతోష్ ఇప్పుడేం చేస్తున్నారు? నీతో పాటే ఉన్నారా?"

"లేరు. ఉపేందర్‌రావు బాగా డబ్బున్నవాళ్ళమ్మా

యిని పెళ్ళి చేసుకొని, ఎదో కంప్యూటర్ కోర్సు చేసి భార్యతో స్టేట్స్‌కు వెళ్ళిపోయాడు. యాదగిరి చిట్టీల బిజినెస్. గిరి బ్యాంక్ స్టార్ట్ చేసి ఇప్పుడు బాగా సంపాదిస్తున్నాడు. సారయ్య కమర్షియల్ టాక్స్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ పోస్ట్ సంపాదించి హాయిగా రెండు చేతులతో సంపాదిస్తున్నాడు. సంతోష్‌కు పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇస్తామని ఆశపెట్టి వాడినో పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మార్చేశారు. మిగతావాళ్ళ మాటెలా ఉన్నా వీడొక్కడు మాత్రం ఓ ప్రజాద్రోహిగా మారిపోయాడు."

"ఎంత పతనం. సంతోష్ పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారాడా? ఆ రోజుల్లో అనుక్షణం పోలీసుల్ని బూతులు తిట్టే సంతోష్ ఇప్పుడు పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారడమేమిటి?"

"ఆశ మనిషిని ఎంతకైనా దిగజార్చుతుంది. అయినా, ఇంకెంత కాలంలే. వాడి రోజులు దగ్గర పడ్డాయి."

"అంటే, వాడిని చంపేస్తావా ఏమిటి? ఒకప్పుడు నీ ప్రాణానికి ప్రాణంగా నిలిచిన నీ స్నేహితుణ్ణి..."

"ఉద్యమంలో స్నేహితుడైనా, చుట్టమైనా, చివరకు నీ తోడబుట్టిన అన్నైనా, తమ్ముడైనా... ఎవరైనా సరే ప్రజాద్రోహానికి పాల్పడినప్పుడు వాడిని అంతం చెయ్యక తప్పదు."

ఇడ్లీలు తిని, టీ తాగి, బిల్ చెల్లించి ఇద్దరూ బయటకొచ్చారు.

"నీ బండి మీద నాకో చోటికి లిఫ్టిస్తావా?" అడిగాడు సుధాకర్.

"ఎక్కడికి?"

"నేను తార్నాక వెళ్ళాలి."

"నేనుండేది కూడా తార్నాక లోనే. సో, నో ప్రాబ్లమ్. వెళ్దాం పద."

శ్రీధర్ మోటారు సైకిల్ స్టార్ట్ చేశాడు. సుధాకర్ వెనుక సీట్లో కూర్చున్నాడు. త్వరలోనే వాళ్ళిద్దరూ వేగంగా తార్నాక వైపు వెళ్ళసాగారు.

> "నువ్వు అడగబోయే మాటేమిటో నాకు తెలుసు. అతన్ని ఎలాగైనా వదలించుకోమంటావు. నిజానికి నాకు కూడా అతన్ని వదుల్చుకోవాలనే ఉంది. కానీ, అతను మనల్ని వదలడం లేదే."

పదిహేను నిమిషాల్లోనే శ్రీధర్ తార్నాకలోని ఓ ఇంటి ముందు బండాపి, "ఇదే మా ఇల్లు" అన్నాడు.

"ఉమని పలకరించి వెళ్ళనా" అన్నాడు సుధాకర్.

"ఉమ ఈ టైమ్‌లో ఉండదు. తొమ్మిదింటికే ఆమె స్కూలుకెళ్ళిపోతుంది."

"మరోసారెప్పుడైనా వస్తాలే. నేనిక వెళ్ళిపోతాను."

"ఎక్కడికి?"

"నేను వెళ్ళాల్సిందెక్కడికో నీకు చెప్పకూడదు. అసలు మనం కలుసుకున్నట్టే ఎవరికీ తెలియ కూడదు. నా పేరిప్పుడు సుధాకర్ కాదు, వరహాల స్వామి. అర్థమైందనుకుంటాను."

"అర్థమైంది."

సుధాకర్ వేగంగా నడుస్తూ ముందుకెళ్ళిపోయాడు.

శ్రీధర్ కాసేపు చెప్పులు లేని కాళ్ళతో వేగంగా నడుస్తూ వెళ్తున్న సుధాకర్‌కేసి ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు.

* * *

మూడు నెలలు గడిచిపోయాయి. ఓ అర్ధరాత్రి బయటెవరో కాలింగ్ బెల్ నొక్కుతున్నట్లుగా అర్థం కావడంతో శ్రీధర్ బెడ్ మీంచి లేచి కూర్చున్నాడు.

"ఇంత రాత్రి వేళ మనింటికెవరొస్తారు" అంటోంది అతని పక్కనే ఉన్న ఉమ.

"ఎవరో చూస్తానుండు" అంటూ శ్రీధర్ పక్క మీంచి లేచాడు.

"ఎవరో బాగా తెలిసినవాళ్ళైతే తప్ప తలుపు తీయకండి" అంది ఉమ.

"అలాగేలే" అన్నాడు శ్రీధర్.

కిటికీ తలుపులు తెరచి, "ఎవరూ" అన్నాడు శ్రీధర్.

"శ్రీధర్, నేనే. త్వరగా తలుపు తీయ్" అంటున్నారెవరో. ఆ కంఠం తనకు బాగా తెలిసినట్లే అనిపించింది. కానీ, గబుక్కున ఆ కంఠం ఎవరిదో గుర్తుకు రాలేదు.

"నేనే అంటే ఎవరు" అన్నాడు శ్రీధర్.

"నేన్రా శ్రీధర్, సుధాకర్‌ని. త్వరగా తలుపు తీయ్. ప్లీజ్." అవతలి వ్యక్తి కిటికీ దగ్గరకు వచ్చి గుసగుసగా చెప్పాడు. అతనెవరో శ్రీధర్‌కు అర్థమైంది. ఇంత రాత్రివేళ వీడెందుకొచ్చాడో. తలుపు తీస్తే ఒక సమస్య తీయకపోతే ఒక సమస్య.

"ఎవరండీ" అంటూ వచ్చింది ఉమ.

"సుధాకర్. ఆరోజు అయ్యప్ప భక్తుడి వేషంలో ఓ హోటల్లో కలిశాడని చెప్పానే."

"అమ్మో! వద్దండీ. తలుపు తియ్యొద్దు. మీరా రోజు అతనికి మనిల్లు చూపించి చాలా పొరపాటు చేశారు. అతన్ని వెళ్ళిపొమ్మని చెప్పండి. అతడు మనింట్లో ఉన్నట్టు పోలీసులకు తెలిస్తే మనల్ని బతకనివ్వరు" అంది ఉమ వణకుతున్న కంఠంతో. భయం ఆమెను నిలువెల్లా ఆవహించింది.

"శ్రీధర్ త్వరగా తలుపు తీయ్. ఫ్రెండ్‌వని నిన్ను వెతుక్కుంటూ వచ్చాను. చాలా ప్రమాదంలో ఉన్నాను. ప్లీజ్." బయటి నుంచి సుధాకర్...

ఏం చెయ్యాలో కాసేపటిదాకా శ్రీధర్‌కు తోచలేదు.

"ఇంత రాత్రివేళ మనల్ని వెతుక్కుంటూ వచ్చిన వాడిని ఎక్కడికి పంపిస్తాం? వాడొకప్పుడు మన ఫ్రెండ్. నువ్వు నాకు వాడి ద్వారానే పరిచయమయ్యావు. ఆ రోజుల్లో వాడే మనకు ఫ్రెండ్, ఫిలాసఫర్ అండ్ గైడ్. వాడికిప్పుడు మనం షెల్టర్ ఇవ్వకపోతే మనల్ని మనం క్షమించుకోలేం."

"ఏమో, నాకదంతా తెలియదు. నాకు మాత్రం చచ్చేంత భయమేస్తోంది. మీ ఇష్టం" అంది ఉమ.

శ్రీధర్ తలుపు తీశాడు. సుధాకర్ మరుక్షణంలో లోపల కొచ్చేసి వెంటనే తలుపులు మూసేసి బోల్టు పెట్టేశాడు. అతడే కిటికీ కూడా మూసేశాడు.

ముగ్గురూ ముందు రూంలోంచి లోపలకు హాల్లో కొచ్చారు. సుధాకర్ ఇప్పుడు మరో వేషం వేశాడు. మోకాళ్ళు దాటి పాదాలదాకా వేలాడుతున్న చొక్కా, చుడీదార్, పైజామా వేసుకొని, నెత్తిమీద బొచ్చు టోపీ పెట్టుకున్నాడు. గడ్డం, మీసాలు పెంచాడు.

"ఇంత రాత్రి మిమ్మల్ని డిస్టర్బ్ చేసినందుకు సారీ. ఈ ఒక్కసారి మీ ఇంట్లో షెల్టర్ తీసుకోక తప్పలేదు. మరోసారి మీకిలాంటి ఇబ్బంది కలిగించను" అన్నాడు సుధాకర్ నెత్తిమీదున్న టోపీ తీసేస్తూ.

"ఏమైంది" అన్నాడు శ్రీధర్.

"పోలీసులు నిన్ను వెంటాడడం లేదు కదా. నువ్వు మా ఇంట్లో షెల్టర్ తీసుకుంటున్నట్టు వాళ్ళకు తెలీదు కదా" అంది ఉమ.

"లేదు. ఏమీ తెలీదు. నువ్వు కంగారుపడకు ఉమా! ఇక్కడికి దగ్గర్లోనే ఉండే రామ్మూర్తి మా ఫ్రెండ్. వాడిని కలుద్దామని వచ్చాను. వాడిల్లు లాక్‌చేసి ఉంది. పక్కింటివాళ్ళనడిగితే పదిహేను రోజులక్రితమే రామ్మూర్తి ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాడని చెప్పారు. నేను రామ్మూర్తి ఇంట్లో చాలాసార్లే షెల్టర్ తీసుకున్నాను. వాడు నాకు ఇన్‌ఫార్మ్ చెయ్యకుండా ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాడంటే పోలీసులకు వాడింటి మీద అనుమానం కలిగినట్టుంది."

"రేపు మా ఇంటి మీద మాత్రం పోలీసులకు అనుమానం కలగదా? దయచేసి వెంటనే వెళ్ళిపో సుధాకరన్నా! మమ్మల్నిలా బతకనివ్వు. నా కోసం కాకపోయినా నా కడుపులో పెరుగుతున్న మరో జీవి కోసమన్నా నువ్వు వెంటనే వెళ్ళిపో సుధాకరన్నా! పోలీసులకు మా మీద అనుమానమొచ్చిందంటే మమ్మల్నిక బతకనివ్వరు." ఉబికి వస్తున్న కన్నీళ్ళను ఆపుకోలేకపోయింది ఉమ.

"కంగారు పడొద్దు ఉమా! నేనిప్పుడు బయటకు వెళ్ళలేను. నేనిప్పుడు బయటకు వెళ్తే నాకే కాదు, మీకూ ప్రమాదమే. ఈ ఒక్క రాత్రికి మాత్రమే నాకు మీ ఇంట్లో షెల్టరివ్వండి. తెల్లారగానే నేను లేచి వెళ్ళిపోతాను." ఉమ కన్నీళ్ళు తుడుచుకుంటూ లోపలకు వాళ్ళ రూమ్‌లోకెళ్ళిపోయింది. అతడు పడుకోవడానికి హాల్లోనే అతనికి పడక ఏర్పాటు చేసి శ్రీధర్ కూడా వాళ్ళ రూమ్‌లోకెళ్ళిపోయాడు.

తెల్లారాక కూడా సుధాకర్ వాళ్ళింట్లోంచి వెళ్ళిపోలేదు. "బయట తాళం వేసి మీరెళ్ళి మీ పనులు చూసుకోండి. నేను మీ ఇంట్లో మరో రెండ్రోజులుండక తప్పడం లేదు" అన్నాడు సుధాకర్. అది చలికాలం కాకపోయినా అతను ఒంటినిండా రగ్గు కప్పుకొని ఉండడం చూస్తే శ్రీధర్‌కు వీడికేదో అయినట్టుగా ఉంది అన్న అనుమానం వచ్చింది. అతని దగ్గరకెళ్ళి అతడి ఒంటిమీద చెయ్యేసి చూశాడు. వెంటనే శ్రీధర్‌కు, సుధాకర్‌కు బాగా జ్వరమొచ్చిందని అర్థమైంది.

"ఎవరైనా డాక్టర్‌ను తీసుకురమ్మంటావా" అన్నాడు శ్రీధర్.

"వద్దు. నా దగ్గర మందులున్నాయి. ఈ జ్వరం నన్నేం చెయ్యదు. రెండ్రోజుల్లో తగ్గిపోతుంది. మీరు వెళ్ళిపోండి" అన్నాడు సుధాకర్.

"అన్నం, కూరా వండాను. ఆకలేసినప్పుడు పెట్టుకొని తిను. పాలున్నాయి, బ్రెడ్డుంది. టీ తాగాలనిపిస్తే చేసుకో" అంది ఉమ.

"అలాగే" అన్నాడు సుధాకర్. వాళ్ళిద్దరూ బయటికొచ్చి ఇంటికి తాళం వేసి వెళ్ళిపోయారు.

రెండ్రోజుల తర్వాత అతనికి జ్వరం తగ్గింది. అతడు పూర్తిగా కోలుకోవడానికి మరో మూడు రోజులు పట్టింది. అయిదు రోజుల తర్వాత ఓ రోజు అర్ధరాత్రి ఎలా వచ్చాడో అలాగే అతడు బయటకు వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిపోతున్నప్పుడు ఉమ, "దయచేసి మరోసారి మా ఇంటికి రావొద్దన్నా. శ్రీధర్‌కేమన్నా అయితే నేను బతకలేను. నేనొక్క దాన్నైనా ఎలాగో బతికేదాన్నేమో! మా మీద ఆధారపడి బతికే మరో జీవి నా కడుపులో ప్రాణం పోసుకుంటోంది. ఆ మరో జీవి కోసమన్నా నువ్వు మాకు దూరంగా ఉండాలన్నా" అంది.

"అలాగే ఉమా. శ్రీధర్ ప్రాణానికి నా ప్రాణం... నిజం చెప్పాలంటే ఈ అయిదు రోజులు మీరు నాకు షెల్టర్ ఇవ్వడం ద్వారా మీరు నా ప్రాణాన్ని రక్షించారు. ఆ రాత్రి నేనెంత ప్రమాదంలో ఉన్నానో మీకు తెలీదు. నా ప్రాణాన్ని రక్షించిన మిమ్మల్ని రక్షించడం నా విధి. మరోసారి నేను మీ దగ్గరకు రాను. ప్రామిస్" అన్నాడు సుధాకర్. అలా వెళ్ళిపోయిన సుధాకర్ చాలా రోజులదాకా మళ్ళీ వాళ్ళకు కనిపించలేదు. ఈలోగా ఉమకు పాప పుట్టింది.

ఓరోజు పేపర్లో ఓ వార్త చదివి శ్రీధర్ షాకయ్యాడు.

ఒకప్పటి తన మిత్రుడు సంతోష్ మోటార్ సైకిల్ మీద వెళ్తోంటే గుర్తు తెలీని వ్యక్తులు అతన్ని వెంటాడి కాల్చి చంపేశారన్నది ఆ వార్త. శవంగా మారిన సంతోష్ ఫోటో కూడా పేపర్లో ప్రచురించారు.

సంతోష్‌ను చంపేసింది ఈ మధ్య సిటీలో యాక్టివ్‌గా పనిచేస్తున్న సుధాకర్ దళమేనని పోలీసులు తెలియజేశారు. ఆ వార్త చదవగానే శ్రీధర్ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఒకప్పుడు తానూ, సుధాకర్, సంతోష్, సారయ్య, ఉపేందర్, యాదగిరి ఎంత ఆత్మీయంగా, అన్యోన్యంగా ఉండేవాళ్ళో అతనికి గుర్తొచ్చింది. తమని కాలేజీలో కొందరు పంచపాండవులనేవాళ్ళు. అయిదుగురూ ఒక ప్రాణంగా బతికారు. ఒకరంటే ఒకరికి ఎంత ఆప్యాయత, ఎంత అనురాగం, ఎంత అభిమానం, ఎంత అన్యోన్యత. అయిదుగురూ కలిసి ఎన్ని కలలు కనేవాళ్ళు. విప్లవం అనివార్యమని, విప్లవం జయించి



తీరుతుందని, ప్రపంచంలో ఏ శక్తీ విప్లవాన్ని అడ్డుకోలేదని, నమ సమాజం స్థాపించబడుతుందని, దోపిడీకి, దొరతనానికి, దుర్మార్గానికి శాశ్వత సమాధి కట్టేస్తామని, కులాలకూ, మతాలకూ, వంచనకూ, వర్గాలకూ అతీతమైన స్వచ్ఛమైన మానవత్వానికి పట్టం కట్టాలని ఎన్ని కలలు కనేవాళ్ళో. ఆ కలల్లో ఎంత థ్రిల్, ఎంత హాయి, ఎంత మాధుర్యం, ఎంత మత్తు, ఎంత ఆశ. అవన్నీ ఇప్పుడేమయిపోయాయి? నడివీధుల్లో మనుషుల్ని మనుషుల్నే, ఒక ప్రాణంగా బతికిన ఆత్మీయుల్నే చంపుకునే ఈ దయనీయమైన పరిస్థితి ఎందుకేర్పడింది? తననెవరో దారుణంగా మోసగించినట్టనిపించింది. తనమీద తనకే అసహ్యం వేసింది. మనిషన్నవాడు ఎక్కడ ఏ పొరపాటు చేసినా అందులో తనకూ భాగస్వామ్యం ఉందేమోననిపిస్తుంది.

*          *          *

మరో నెల రోజులు గడిచాయి. సాయంత్రం శ్రీధర్ తన బండిమీద ముషీరాబాద్ గుండా వెళ్తోంటే సుధాకర్ కనిపించి అతన్ని ఆపాడు. ఈసారతడు ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ వేసుకొని ఓ రాజకీయ నాయకుడి గెటప్‌లో కనిపించాడు. 'పంజగుట్ట దాకా లిఫ్టివ్వ'మని అడిగాడు. శ్రీధర్ కాదనలేకపోయాడు. అతన్ని పంజగుట్ట చౌరస్తా దగ్గర దింపి శ్రీధర్ ఇంటికెళ్ళిపోయాడు. ఇంటికి రాగానే ఉమకీ విషయం చెప్పాడు.

"ఈ రోజు మళ్ళీ సుధాకర్ కనిపించాడు."

"ఎక్కడ?"

"ముషీరాబాద్‌లో ఉన్న రీటైల్ షాపువాళ్ళ దగ్గరకెళ్ళి లెక్కలు చూసుకొని ఇంటికే వస్తున్నాను. రోడ్డుమీద సుధాకర్ కనిపించి ఆగమన్నట్టుగా సైగ చేశాడు. ఆగకపోతే బాగుండదని ఆగాను. పంజగుట్టదాకా లిఫ్టివ్వమన్నాడు."

"మీరిచ్చారు."

"ఇవ్వకుండా ఎలా ఉండగలం? అతడు బండికి అడ్డొచ్చి ఇస్తావా? చస్తావా అన్న ధోరణిలో అడిగితే ఏం చేస్తాం?"

"అతడు మనల్ని వదిలేలా లేడండి. అతన్ని మీరు మీ బండిమీద ఎక్కించుకొని వెళ్తోంటే పోలీసులు వెంటపడ్డారనుకోండి ఏం చేస్తారు?"

"ఏం చేస్తానో నిజంగా అటువంటి పరిస్థితి ఎదురైతేగాని చెప్పలేను."

"మీరు నాకో మాటిస్తారా?"

"నువ్వడిగే ఆ మాటేమిటో నాకు తెలుసు. అతన్ని వదిలించుకోమంటావు. నాకూ అతన్ని వదిలించుకోవాలనే ఉంది. కానీ, అతడు మనల్ని వదలటం లేదే."

"అతడు మనల్ని వదలకున్నా మనమే అతన్ని వదిలించుకోవాలి. అతడు లిఫ్ట్ అడిగితే అతనికో దండం పెట్టి నేను అర్జెంట్‌గా వేరే చోటికి వెళ్ళాలని చెప్పి తప్పించుకొని వచ్చెయ్యాలి. మీరు మన పాపమీద ప్రమాణం చేసి చెప్పండి మరోసారి అతనికి లిఫ్ట్ ఇవ్వనని" అంటూనే నిద్రపోతున్న పాపను అతని దగ్గరకు తీసుకొచ్చి పాప నెత్తిమీద అతని చెయ్యి పెట్టింది. వెంటనే అతడు తన చెయ్యిని పాప నెత్తిమీంచి తీసేశాడు.

"నీకేమన్నా పిచ్చి పట్టిందా ఉమా! నేనేదో అతనికి కావాలని లిఫ్ట్ ఇస్తున్నట్టుగా మాట్లాడుతున్నా వేమిటి? అతనికి మరోసారెప్పుడూ లిఫ్ట్ ఇవ్వను. సరేనా" అన్నాడు శ్రీధర్.

నిద్రలోంచి లేచిన పాప ఏడవడం మొదలెట్టింది. పాపను చూస్తూ ఉమ కూడా ఏడుస్తూ ఉండిపోయింది.

"ఊరుకో ఉమా. మరోసారి అతనికి లిఫ్ట్ ఇవ్వను. నువ్వన్నట్టు ఏదన్నా కారణం చెప్పి తప్పించుకుంటాను. సరేనా" అన్నాడతడు ఆమెను తన దగ్గరకు తీసుకొని ఆమె కన్నీళ్ళు తుడుస్తూ.

మరో వారం రోజులు గడిచాయి.

శ్రీధర్ బొలారంలో ఉన్న సోమేశ్వర్ ఫ్యాక్టరీకి వెళ్తున్నాడు. రోడ్డుమీద సుధాకర్ కనిపించాడు. ఈసారతడు లైట్ బ్లూ కలర్ జీన్స్ వేసుకున్నాడు. కళ్ళకు రేబాన్ గ్లాసెస్ పెట్టుకొని ఓ కోటీశ్వరుడి కొడుకులా కనిపించాడు. శ్రీధర్ బండికి అడ్డంగా వచ్చి, "నేనూ తార్నాకకే వస్తున్నాను" అన్నాడు.

"నేనిప్పుడు తార్నాకకు వెళ్ళడం లేదు. చాలా అర్జెంట్ పనిమీద బోయినపల్లి వెళ్తున్నాను. దయచేసి నన్ను పోనీయ్" అన్నాడు శ్రీధర్.

"నన్ను తార్నాకలో దింపేసి నువ్వు బోయినపల్లి వెళ్దువుగానిలే. నేనక్కడో వ్యక్తిని అర్జెంట్‌గా కలుసుకోవాలి."

"ఆటోలోనన్నా, టాక్సీలోనన్నా వెళ్ళు. నన్ను వదిలెయ్ ప్లీజ్."

"కంగారు పడకు. ఎలాంటి రిస్క్ లేదు. నన్నెవరూ ఫాలో కావడం లేదు. నేనన్ని ప్రికాషన్స్ తీసుకునే బయల్దేరాను."

"ఏమన్నా చెప్పు. నేను మాత్రం నీకు లిఫ్టివ్వను. ఇంకేదన్నా చూసుకో."

"తెలిసినవాళ్ళతో తప్ప నేను కొత్తవాళ్ళతో వెళ్ళకూడదు. పోలీసు నెట్‌వర్క్ బాగా విస్తరించింది. ఆటోలోగాని, టాక్సీలోగానీ వెళ్ళడం చాలా రిస్క్. నీతో వెళ్తేనే రిస్క్ లేదు. ఏం కాదు. నీ ప్రాణానికి నా ప్రాణం. సరేనా. కమాన్. స్టార్ట్ చెయ్యి. పది నిమిషాల్లో వెళ్ళిపోతాం. మ్యాటరాఫ్ టెన్ మినిట్స్" అంటూనే అతడొచ్చి శ్రీధర్ వెనుక కూర్చున్నాడు. శ్రీధర్ బండి స్టార్ట్ చేసి వేగంగా పోనిచ్చాడు. వీణ్ణి పది నిమిషాల్లో వదిలించుకొని బయటపడాలి. ఈసారితనికి లిఫ్ట్ ఇచ్చినట్టు ఉమకు చెప్పకూడదు. పది నిమిషాల్లో వాళ్ళు తార్నాక చౌరస్తా చేరుకున్నారు.

"లెఫ్ట్‌సైడ్. ఫైవోవర్ పక్కనున్న సందులోకి పోనిచ్చి ఆపెయ్" అన్నాడు సుధాకర్.

శ్రీధర్ బండిని లెఫ్ట్‌సైడ్ మళ్ళించి సుధాకర్ చూపించిన ఇంటి ముందు బండాపాడు. మరుక్షణంలో మఫ్టీలో ఉన్న పదిమంది పోలీసులు వాళ్ళను చుట్టు ముట్టారు. రివాల్వర్ చూపించి లొంగిపొమ్మన్నారు. ఇద్దర్నీ అరెస్టు చేసి పక్క సందులో ఉన్న పోలీసు వ్యాన్ ఎక్కించి ఎక్కడికో తీసికెళ్ళారు.

ఎవరింటి ముందైతే సుధాకర్ బండాపమన్నాడో ఆ ఇల్లు విప్లవ పార్టీలవాళ్ళకు రహస్యంగా ఆయుధాలను సప్లై చేసే ఓ కాంట్రాక్టర్ ఇల్లని, ఇదివరకు ఆ ఇంటికే సుధాకర్ చాలాసార్లు వచ్చాడనీ, ఈ మధ్యనే ఆ ఇంటిమీద పోలీసులు కన్నేసి ఉంచారని, ఆయుధాలు సప్లై చేసే కాంట్రాక్టర్‌ను కొద్దిసేపటి క్రితమే పట్టుకొని టార్చర్ చేస్తే కాసేపట్లో అక్కడికి సుధాకర్ వస్తాడని చెప్పాడని శ్రీధర్‌కు తెలీదు.

వాళ్ళిద్దర్నీ ఎక్కడకు తీసికెళ్ళారో ఎవరికీ తెలీదు.

చాలా దూరం వ్యాన్‌లో వెళ్ళాక, సిటీ ఔట్‌స్కర్ట్స్ దాటాక వ్యాన్ ఓ ఇంటిముందు ఆగింది. బయటకు చూడడానికి అదో ప్రైవేట్ ఇంటిలాగే కనిపించింది. కానీ, అదో రహస్య పోలీసు స్థావరమని చాలామందికి తెలీదు. పోలీసులు వాళ్ళిద్దరి కాళ్ళకూ, చేతులకు బంధాలు వేసి ఆ ఇంట్లో ఓ గదిలో బంధించారు.

శ్రీధర్‌కు అనుక్షణం ఉమ, పాప గుర్తొచ్చారు. అంతా రెప్పపాటులో కలలో జరిగినట్టుగా జరిగింది. తననిప్పుడు వాళ్ళేం చేస్తారు? ఏ పాపమెరుగని తననూ, సుధాకర్‌నూ ఒకేలా చూస్తారా? సుధాకర్‌కిచ్చే పనిష్‌మెంట్‌నే తనకూ ఇస్తారా? తాను సుధాకర్‌కు లిఫ్టిచ్చానని తెలిస్తే ఉమ తనను క్షమిస్తుందా? తనను పోలీసులు బంధించినట్టు ఉమకు తెలిస్తే ఎంత బావుండును. ఎన్ని ప్రయత్నాలు చేసైనాసరే తనను విడిపిస్తుంది. కానీ, ఉమకీ విషయం తెలిసే అవకాశం లేదు. రేపు పోలీసులు తమను కోర్టులో ప్రొడ్యూస్ చెయ్యాలి. అరెస్ట్ చేసిన ఇరవై నాలుగు గంటల్లో కోర్టులో ప్రొడ్యూస్ చెయ్యాలి. కానీ, చేస్తారా? అలా చేస్తే తనను అరెస్ట్ చేసిన విషయం ఉమకు తప్పకుండా తెలుస్తుంది. సోమేశ్వర్ తనకు బెయిలిప్పిస్తాడు. తర్వాతెలాగైనా, నాన్న సహాయాన్ని అర్థించైనా... నాన్నకు బోల్డు ఇన్‌ఫ్లుయన్స్ ఉంది. బయటపడొచ్చు.

అర్ధరాత్రి దాటాక వాళ్ళిద్దర్నీ ఆ గదిలోంచి బయటకు తీసుకొచ్చారు. కాళ్ళకూ, చేతులకూ వేసిన కట్లు విప్పారు. వాళ్ళు వేసుకున్న బట్టల్ని విప్పి వేరే బట్టలు వేశారు. వాళ్ళకు తొడగబడిన బట్టలు అడవుల్లో తిరిగే నక్సలైట్లు వేసుకునే ఆలివ్ గ్రీన్ యూనిఫామ్స్. ఆ బట్టలు తమకెందుకు తొడిగిస్తున్నారో శ్రీధర్‌కు అర్థం కాలేదు. కానీ, సుధాకర్‌కు అర్థమైంది.

వాళ్ళిద్దరి కాళ్ళకు, చేతులకు మళ్ళీ బంధాలు వేసి బయటకు తీసుకొచ్చి బయట నిల్చోబెట్టిన పోలీసు వ్యాన్‌లో కెక్కించారు. వ్యాన్ వేగంగా వెళ్ళి అక్కడకు దూరంలో ఉన్న ఓ అడవి మధ్యలో ఆగింది. తెలతెల వారుతుండగా వాళ్ళిద్దరూ శవాలుగా మారిపోయారు. మెదక్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు ప్రముఖ నక్సలైట్లు చనిపోయారని పోలీసులు ప్రకటించారు. ఆ వార్తను ప్రముఖ పత్రికలన్నీ వాళ్ళిద్దరి శవాల ఫోటోలతో సహా ఆ మర్నాడు ప్రచురించాయి. ■